చూర్ణిక

తీర్థయాత్రకు పోదామంటే ఏ తిరుపతో, కంచో, కాళాస్తో అనుకున్నాగాని, ఇక్కడికొచ్చామేం—అంటావా?–

ఒరే—నాకు ఈ ఊరిమీదే గురి!–ఈ ఊరు, అనాదిగా బాపన్నపల్లి — ఇప్పుడు లచ్చమ్మపేట!-

మా మేనత్త—అంటే—మేనమామ భార్యా— ఆ లచ్చమ్మగారు, ఆవిడ పుట్టి పెరిగిన ఊరు: మా మేనమామ జోలెపట్టిన ఊరు:

మా ఊరినుంచి ఈ ఊరొచ్చి, - ఇక్కడినుంచే నేను పట్నం పారిపోయొచ్చే సింది! -

అంటే ఊరు తరిమికొట్ట లేదు—మా నాన్న ఇక్కడకూ తరుముకొచ్చి హడల కొట్టాడు. మనం ఉడాయింవాము :

మా అమ్మ పుట్టిల్లూ ఈ ఊరే. మాతామహులు వృత్తిలేక ఉపాదానం చేసుకునేవారు! ఒక్క కొడుకు, ఒక్క కూతురు : ఆ కూతుర్ని అంటే మా అమ్మను.... తనలాగానే సీతారామాభ్యాంనమః అనుకుంటూ జీవిస్తూన్న మా నాయనకు కాళ్ళుకడిగి ధారపోశాడు: మా నాన్న—ఉన్నంతలో ప్రయోజకుడే— నోటి మంచి తనాన — అందరినీ అయ్యా బాబు అంటూ—అలాగే ఆ లక్ష్యం కొద్దీ, నలుగురూ తలో తృణమూ ఇవ్వగా—ఆ పరకలు పోగుచేసి — యజ్ఞం చేశాడు — పెద్ద పెట్టునే. కాని, బ్రతకనేర్చినవాడు కాకపోవడంతో కాస్తో కూస్తో వెనకేసుకోలేదు : ఆ మర్నాటి నుంచి, తానూ తన రాగిచెంబూ....యథాప్రకారమే :

మా నాన్న చూశావ్....బయట పరమ సాధువే కాని— ఇంట ఫాలాక్షుడు : ఎవరిమీదా కోపంకాదు-ఎందుకో ఒకందుకని కాదు.... ఎప్పుడూ ఒకటే ధుమధుమ : అలా అని పెళ్ళాన్ని వేపుకుతినేవాడా....అక్కడ పిల్లి!—నామీద మాత్రం ఒంటి కాలుమీద లేచేవాడు.

ఉపనయనం చేశాడు : తనతోబాటు-ఓ రాగి చెంబిచ్చాడు....నేను ఉహూ అన్నాను: ఒక దరువేశాడు: నేను దులిపేసుకున్నాను: మరోవిడత ఉతికాడు .... పారిపోయి—రాజావారి తోటలో జామచెట్టెక్కాను: దిగిరా, తాట వలుస్తానన్నాడు మా నాన్న....మూడురోజులు అట్లాగే వున్నాను.... కటుక్కాయలు కొరుకుతూ .... మా అమ్మ మజ్జిగా అన్నం కలుపుకొచ్చి....అఘోరింవావు కాని, దిగిరా అంది. ఎదిరించేందుకన్నా సత్తువుండాలి. తిని ఏడు !- అన్నాడు నాన్న: ఉహూ అన్నాను: సరే నీ కర్మం నీది....ఎన్నాళ్ళుండుతావో ఎండు....అని—పదండి .... అని, నాన్నను మళ్ళించుకు పోయింది....నేను కిందికి దూకి-మరో మాను మండ విరిచి-చిక్కాకర్రా చేసి-కూత పట్టుకుంటూ మా అత్తయ్యగారి ఇంటికి చేరుకున్నాను .... ఆ యిల్లు చూపిస్తాగా....

ఈ ఊళ్ళో కమామీషు ఏమిటంటే .... హనుమయ్యగారని, మా అత్తయ్య నాన్న...మోతుబరి...వేదం చెప్పుకుని వ్యవసాయంలోకి దిగి ... దస్తు కూడబెట్టి....

పొలుకొచ్చిన పక్కచేలు కలుపుకుని...ముప్ఫైపుట్ల ఖామందు అయినాడు: అదో తరహా మనిషి....పేదసాద నోకంట కనిపెట్టేవాడు: కలిగినవాడు, పిసరంత పొరబాటు చేసెనా కత్తి కట్టేవాడు: వస్తుతః పిల్లికి బిచ్చంవేసే తరహా కాదు. పేదవాడింట పెళ్ళంటే అక్కడ ప్రత్యక్షమయేవాడు: నేనున్నానురా అనిపించేవాడు: అడగనివాడిని పిలిచి చేబదు లిచ్చేవాడు: వాడు యివ్వలేకపోతే—తిట్టి, మళ్ళీ పెట్టుబడి పెట్టేవాడు: వాడు అదీ ఇదీ ఎగేసి—ఊరు విడిచి పారిపోతే - వెంట తరుముకుపోయి, ఎక్కడున్నా వెదికి పట్టుకుని, సిగపాయదీసి తన్ని, మొగంవాచే చివాట్లుపెట్టి, వాడి కష్ట సుఖం ఆరాతీసి—వాడిలోటు తీర్చి వచ్చేవాడు: అదో తరహా...

ఓనాడు....తనంత మోతుబరే.... ఒకాయన .... కొడుకు బడికిపోవడం రలాయిస్తే....బళ్ళోకి లాక్కెళ్ళి కుర్రాళ్ళ ముందు పడేసి బాదాడు: ఇది తెలియడంతోనే హనుమయ్యతాత—పోయి వాళ్ళ అరుగుమీద తిష్టవేసి- తనంత ఆసామినీ ... తన కన్న ఏడో ఆరో, పెద్దవాణ్ణి, గుమ్మం ఎక్కకుండా నిలవేసి, దుప్పటీ దులిపినట్టు పట్టుకు దులిపేశాడు. మొగం వాచిపోయేట్టు కొట్టాడు:

"తండ్రి పేరెట్టుకుంది, తన్నేందుకట్రా అప్రాచ్యుడా ....

మీ నాన్న నీ కడుపున పుట్టింది...యిందుకట్రా...

నీవు బ్రాహ్మడివా, లుచ్ఛావాడివా?—

ఒరేయి...యీ యేడు - మీ నాన్న ఆబ్దీకానికి....బ్రాహ్మణ్యం రాదు: నీ కిదే శిక్ష...పోయి కాశీలో పెట్టిరా....

బళ్ళో పిల్లలకు పప్పూ బెల్లాలు పంపించు: యీ పూటే కాశీ పో౹ — తిరిగి వచ్చి...మీ నాన్న పేరు చెప్పి గుళ్ళో అభిషేకం చేయించి అప్పుడు యింట కాలెట్టు... బళ్లో వాళ్ళకీ, మాబోటి బయటవాళ్ళకీ యింత పప్పూ వణ్ణం పెట్టు" ... అని ఆసామిని—అక్కడే ఆపి—లోపలికి పోయి...."అమ్మాయ్ .... మనవాడు కుర్ర వేషాలు పోయేప్పటికి....కాస్త కూకలేశాలే—అవన్నీ ఘట్టిదెబ్బ లనుకునేవ్— అదిగో చూడు నక్కముద్దల్లేనే ఉన్నాడు....కాశీపోయి వచ్చేస్తాడు కాని — కితనార సంచిలో, కావలసినవి వేసి యియ్యి....బత్తె ఖర్చులు మనింటి దగ్గరనుంచి .... భోంచేసి పట్టుకెళ్తాడులే....యాత్రకు వీడి సంపాదనలో వద్దు....ఫలం ఉండదు...." అన్నాడు:

"అలాగే అన్నయ్యా!" అని—అమర్చి యిచ్చింది ఆ యిల్లాలు:

ఆసామి కిక్కురుమనకుండా....చెప్పినట్లు చేశాడు....

హనుమయ్యగారి మాటంటే అందరికీ శిరాజ్ఞ. అది ఓ తరహా !—

ఆ కూతురుకీ తండ్రి పోలిక వచ్చింది....

ఒక్కతే కూతురు....ఎనిమిదో యేడు...పెళ్ళికెదిగినట్లు లెక్క— వాళ్ళ లెక్క ప్రకారం....అందరూ ఆ సంబంధం అన్నారు, యీ సంబంధం అన్నారు: కానీ కట్నం అక్కరలేదన్నారు.... "ఎవరొచ్చినా ఆస్తిలో పిల్లకో రేజా యివ్వను.. ఎవరు చేసుకున్నా మా బాగే" అన్నాడు హనుమయ్యగారు: అంతటితో, ఒక్కడూ ముందుకు రాందే....

మా మామయ్య ... వారి యింటికి నిత్యమూ మధూకరానికి వెళ్ళేవాడు: అచ్చమ్మ వేసేది...

ఓనాడు అలాగే వెళ్ళగా—ఆ వేళకు హనుమయ్యగారు యింట్లో ఉండి ... "ఒరే రాముడూ—ఆ జోలె అక్కడపెట్టి- పంచపాత్రలో నీళ్ళు పారపోసి, కాళ్ళూ చేతులు కడుక్కొని ఆచమనం చేసి రా: అంగోస్త్రం అక్కడ పారేసి నా ధోవతి కట్టుకుని—పోయి, మీ నాన్నను పిలుచుకురా" అన్నాడు...

అలాగే పిలుచుకుని వచ్చాడు...చేతులు కట్టుకొచ్చాడు మా తాత !-

కూచోమన్నాడు !— కూచున్నాడు.

"చూడు గంగన్నా...ప్రతినిత్యమూ వీడు జోలెకట్టుకు రావడం..తన మల్లేమో యిక్కడ దాచిపెట్టినట్టు...

వీడు వచ్చేవేళకు యీావిడ వణుక్కుంటూ పళ్ళెంతో పప్పూ, అన్నం పెట్టుకు సిద్ధంగా ఉండటం...ఏమిటో నాకు బాగుండలా ?- చూడగా చూడగా...వీడికి వేళకింత తిండిపెట్టేందుకు పుట్టినట్టుంది!—సరే అనుకుంటే పోలా ?—ముహూర్తం పెట్టిస్తా గాని, తన్నిరా!" అన్నాడు. మా తాత తబ్బిబ్బై... చేతులు పట్టుకుని ... "మీ అంతర మేమిటి మా అంతర మేమిటి బావా! చిన్నదానికి అన్యాయం చేస్తున్నావు : ఏ మహా రాజులింటో పడవలసినపిల్ల...నిదానంగా ఆలోచించుకో...ఏనుగు నెక్కిస్తా నన్నావు, కాని మాకా తాహతుః" అని ప్రాధేయపడ్డాడు...

"గంగన్నా...ఉపాదానానికి వస్తావ్...వత్తి బియ్యమే నీకు దక్కుడు— వీడు జోలె కట్టాడు—అన్నప్రాప్తి అయింది :

ఆ జోలెలో-మా లచ్చమ్మ పప్పూ అన్నం వేసింది.

అదేమిదేమని ... నేను మాలచ్చమ్మనే వేశాననుకో-కాదంటావా? —అంటే మటుకు నే నూరుకునేది గనుకనా ... మళ్ళీ నోరెత్తకు ..." అన్నాడు: అలా మా అత్తయ్య పెళ్ళి జరిగింది ... మామయ్య యిల్లరికం ... వేళపట్టు కింత వర్రగా తినడం...వీధి అరుగుమీద కూర్చోడం...యిలా ఏడేళ్ళు ఎండ కన్నెరగకుండా పెరగటంతో—మాంచి నునుపు తేలాడు... ఓ యింటివాడై నాడు...

వాళ్ళకు యిల్లప్పగించి నిశ్చింతగా, ఆ పెద్దవాళ్ళిద్దరూ కాశీకిపోయి అక్కడే ఉండిపోయినారు. దశత అంతా లచ్చమ్మది. ఏడాదైంది, రెండేళ్ళయింది : మామగారు యీ గడప తొక్కలేదు...రామన్న అటూ పోలేదు ... చూసి చూసి ఏమిటిదని నిలవేసింది లచ్చమ్మ.."పోయి మీ అమ్మానాన్నను పిలుచుకురా...ఇంకా ఆ ఉపాదానాలెందుకు?" అన్నది.

"నే తింటున్నా చాలదూ: వాళ్ళ కెందుకులే నీ చేతి బిచ్చం" అన్నాడు రామన్న...

"అహాఁ! అలాగుటా ? - బిచ్చానికొచ్చినా పెళ్ళి కొడుకువే అనుకోవడం తప్పైందే!-నే నెవత్తెను ఒకరికి బిచ్చమెయ్యడానికి... మా నాన్నే నన్ను నీకు బిచ్చమేశాడు..."

"నీవు బిచ్చాని వెందుకనుతావ్ ... యింత కూడోసి కొనిచ్చాడు మీ నాన్న. పొట్ట గడపక అమ్ముడోయినా ననుకోరాదూ ?"

"నీ జోలిబుద్ధులు పోనిచ్చావ్ కావు. ఇంతకూ ఏమిటి – వెళతావా — వెళ్ళవా ?—"

"చిత్తం చిత్తమని నీ అడుగులకు మడుగు లొత్తుతూ - చెప్పినట్టు చెయ్యకపోతే - నాకు అన్నం పుడుతుందా?—"

"ఓయబ్బో రోషం ... ఆలిచేతి అన్నం తినడమే - నీకంత పట్టింపుగా ఉందే?—పోనీ నీవింత వండి నాకింత పెట్టు..."

"ఎవడి సొత్తని..."

"యింతకాలం ఎవరి సొత్తని తిన్నావేం? – అత్తా మా మాయింట లేకుండా చూసి—అల్లుడి బెట్టు మొదలెట్టావేం...ఎవరన్నా వింటే నవ్విపోతారుగాని..."

"నవ్విపోతూనే ఉన్నారు: ప్రతి వెధవా, అడుగో అచ్చమ్మ మొగుడనడం ... నేను వినడంలేదా!—మొండిఘటాన్ని కనుక .. .తిండికిమాలి పడుంటున్నాను."

"పడి ఉండక...ఏం ఘనకార్యం చేస్తావో ?-తెంపుకుపోతాను :"

"అలాగేం: నిన్నెవ్వ రాపుతున్నారు:"

"అయితే యిప్పుడే పోతున్నాను!—"

"మంచిది: బత్తెఖర్చు పట్టుకు పోయిరా—"

"అహఁ. ఇందులో మళ్ళీ యీ బిచ్చమెందుకు నా జోలె నా కుండనే ఉంది:"

"నీకు వచ్చిన విద్య - అదొక్కటే కదా !—"

"ఊ ఆలస్యమెందుకూ ... నేను నిన్ను అననుగాని — యీ ఒక్కమాటా వినిపో ..."

సముద్రంలో మంచి ముత్తెం పుడుతుంది ...

దాని కక్కడ విలువ లేదు...

వింధ్యపర్వతం మీద మంచి గంధం పుడుతుంది ...

దాని కక్కడ వినియోగం లేదు...

కావేరిలో పగడం పుడుతుంది...

దాన్ని ఆ నది ఏం జేసుకోను ...

నేను ముత్తెమల్లే పుట్టాను...పగడమల్లె పెరిగాను...నీ చెంపకు రాసిన మంచి గంధాన్నయినాను...అది నీకు లెక్కలేకపోయె...

తమబిడ్డ - ఇలా ఇక్కడ పేసీ వేయకుండా ఉన్నా - అక్కడ కన్నవారు అలా ఉండగా, అదేమా అని నీ కనిపించకపోయె - యిప్పుడు కొత్తగా అహంకార మంటూ పుట్టుకొచ్చె -

"అచ్చమ్మ మొగుడనిపించు కోవడం నీకు పరువు తక్కువైతే ... కన్నవారి పేదరికం నీకు పరువైతే - నేను నీకు భారమైతే - సరే...నిన్నా పేదెవ్వరూ - నేనూ హనుమయ్య కూతుర్ని...ఎవరిచేతా మాటపడలేదు...పడను...క్షేమంగా పోయిరా..."

"పోతే మళ్ళీ రావడమే..."

"అలాగేం...నరే..."

అమాయకపు అహంకారానికి అదీ ఫలితం -

రామన్న తన దారిని తాను పోయినాడు ... అచ్చమ్మ అత్తవారింటికి వెళ్ళి ... "మీ కుమారుడు విద్యలకోసం కాశీ వెళ్ళారు ... పండితుడై తిరిగి వచ్చి మీ పాదాని వందనం చేస్తానన్నారు...మిమ్మల్ని కనిపెట్టి చూస్తూ నన్నుండి పొమ్మన్నారు: సాలు సాలుకూ ఈ ఇంటికి మూడుపుట్ల ధాన్యం ముద్దినుసులూ, చేతిలో అక్కరకు ఓ మున్నూరు పంపవలసిందిగా - మా నాయన అల్లుడితో చెప్పిపోయినారు : మీరు అభి మానవంతులు కనుక మీ అబ్బాయి సంకోచించారు: వారు చెప్పలేక నన్ను చెప్ప మన్నారు: మీరు కాదనకూడదు" అని, బిడియపడుతూనే అన్నది :

మా తాత అన్నాడు కదా ... "అమ్మా! మీ నాయనగారికి నామీద అంత దయ ఉంది...అది నాకు తెలుసు: నాకు కించిత్ అభిమానమూ ఉంది: అదీ వారికి తెలుసు. అందుకనే వారు నాతో ఆ ప్రస్తావన చేయకుండా నన్ను గౌరవంగా చూశారు:

బిడ్డలు పెట్టగా కూచుని తినవలసినంత అశక్త స్థితికి మేము రాలేదు... ఏదో మా కాలం ఇలాగే వెళ్ళిపోతుంది...అంతగా ఒకరి ఆసరా అంటూ కావలసివస్తే ... నీవు ఉండనే వున్నావు కదా...యింతవరకూ ఏ ఇబ్బంది లేదు ... యిహ ముందూ ఉండదు...

"నాకు ఒక్కటే అమ్మా చింత...యీయన కీ చదువులేమిటి ... అవి ఎప్పటి క్కాను ...

"లక్షణంగా పిల్లా పాప కలుగవలసిన కాలం గదా ... ఎందుకు ఇలా చేశా డమ్మా...నీ వెంత అమాయకురాలివి కాకపోతే...అలా పంపిస్తావా ? .., వద్దనలేక పోయినావా?..."

"వారికి ఎదురు చెప్పడం...యీ జన్మకు చేతకాదు మామయ్యా !"

"పోనీలే అమ్మా...ఒక్కతైవూ అక్కడెందుకూ..."

"సంజెదీపం పెట్టేందుకు...వారు తిరిగి రాగానే ఇద్దరం వచ్చి ఇక్కడ ఉండి పోదాం అని ఉంది:"

మాకు అంత ప్రాప్తం ఉండాలి కద..."

అదేమిటి మామయ్యా...చదువుమీద మొగంమొత్తి రేపేపాటికితిరిగి రారూ... వారికీ, ఇంతప్పటినుంచీ ఒకర్నొకరు విడిచి ఉండటం అలవాటు లేదు కదా..."

అచ్చమ్మ ఇంటికి తిరిగి వచ్చింది...తనకు చిన్నప్పుడు దాదిగా ఉండే ఓ అవ్వను రప్పించుకుని-తోడుంచుకుంది: — ఊరికే చేదోడుగా...నిజానికి ఆవిడకు తోడెందుకు?...

ఒకసారి...అంటే రామన్న కాశీ వెళ్ళిన కొత్తలో ... ఆడకూతురు ఒంటరిగా వుంటూంది కదా అని, మనకు బారాఖాటం అనుకుని ... యిద్దరు దొంగలొచ్చారు... దొడ్డి తలుపు ఉతకెత్తి లోపలికొచ్చి....వంటయింటిక్రింద కన్నం తవ్వుతున్నారు: అచ్చమ్మ కునుకుమీగా ఉన్నా, ఎలాగో పసికట్టింది... పిల్లిలా లేచి వెళ్ళింది...నిశిరాత్రి వెన్నెల రోజులు కాబట్టి-కాస్త మసకగాఉన్నా...మనిషి లీలగా కనబడుతున్నాడు: ఆ ఇద్దరూ ఆవరా-బాదరా-కొత్తసెట్టి కొట్టంటుకున్నట్లు, బెత్తికలు తీస్తున్నారు. అచ్చమ్మ ఒక్క ఉరుకురికి—అందుబాటులో ఉన్నవాడిని నడుం విరిగేట్లు తన్నింది: రెండోవాడు ఉలికిపడేంతలో—వాడి డొక్కలో మోచేత్తో ఒక్క పోటు పొడిచి, వాడు తూలేంతలో పిడికిలితో—గడ్డం పగలేసింది:

పడినవాళ్ళు తెప్పరిల్లేలోగానే పక్కను మేటివేసిన కందికంప-తలోసందెడూ—వాళ్ళమీద వేసి—చేంతాడుతో మోపుకట్టినట్లు కట్టింది...సరాసరి పెద్దకాపు యింటికి వెళ్ళింది. "సన్నయ్య మామా ఏకీగానివేళ ఇద్దరు చుట్టాలెవరో వచ్చారు: నాకు గుర్తు పట్టడం లేదునీ....వొచ్చి ఒక్కసారి పలకరించిపో-"అనగా-సన్నయ్య వెంటనే అర్థం చేసుకుని వచ్చాడు: ఇంటిల్లిపాదీ లేచారేమో...ఒక్క నిమిషంలో ఆ కబురు ఊరు అల్లుకుపోయి, వాడకట్టంతా వచ్చిపడ్డది.

వాళ్ళ కట్లూడదీసి—ఫలానా పాలెంవాళ్ళని గుర్తుచేసుకుని సన్నయ్య కఱ్ఱ తిరగేయబోయినాడు: అచ్చమ్మ కూడదంది: పాలెం మనిషిని పంపి, వాళ్ళ ఆలుబిడ్డల్ని రప్పించింది: వాళ్ళచేత, వాళ్ళఎదుట తడిబట్టలతో ప్రమాణం చేయించింది: తలో రెండెకరాలు వ్రాయించి యిచ్చి—పెళ్ళాంబిడ్డలమొగం చూస్తూ పరువుగా బ్రతకమంది...తనబిడ్డలకు సారెట్టి పంపినట్లు వాళ్ళను సాగనంపింది: మళ్ళీ ఈ ఊరికి దొంగలంటూ రాలేదు: అలాటి మనిషి మా అత్తయ్య!

అది జరిగిన పదేళ్ళకు నేను పుట్టాను.

అచ్చమ్మ వేయికళ్ళతో కనిపెట్టి చూస్తూ అత్త మామల ముప్పు దాటేసింది: అప్పటికి రామన్న కాశీవెళ్ళి పుష్కరం దాటింది:

అప్పట్లోనే-నేనూ అక్కడికి పారిపోయిరావడం:

నిజం చెప్పేశాను: అదేమనలేదు—కూకలేయలేదు— మీగడవేసి ముప్పొద్దులా మేపేది...

నాకు జామచెట్టంటే ప్రాణమని చెప్పానుగా...యిక్కడ- నాగేశ్వరస్వామి ఆలయంలో... అదిగో ఆ కనబడుతున్నదే...అక్కడ ఓ మాంచి జామచెట్టుంది: నేను ఊరుపట్టి తిరుగుతున్నాను.. అక్కడికి చేరుకున్నాను:

ఆ జామచెట్టుమీద, ఓ అమ్మాయి కనిపించింది ... మూగది—కాకిలాగా ఉంది: నన్నుచూసి మూగసైగలు చేసింది: నేనూ కొమ్మెక్కాను.. ఓ కాయ నా మీదికి విసిరింది—పంట కరుచుకున్నాను: యిహ గొంతెత్తింది... మూగది, కురూపి— మతిలేనిది...పాడింది చూసుకో... నేను నేర్చుకున్న రవంత సంగీతం ఆ జామచెట్టుమీదే...

పొద్దుననగా చద్దన్నం తినివచ్చాను... తిరిగి చూసేప్పటికి ప్రొద్దు గ్రుంకింది...క్రిందికి దూకాను... మళ్ళీ వస్తానని సైగచేసి-యింటికి పరుగెత్తాను: అత్తయ్యతో ఈ సంగతి చెప్పాను: నవ్వి ఊరుకుంది:

"ప్రొద్దుననగా పోయి రాకపోతే-నా చేతి బువ్వ నీకు వెగటైందేమో అనుకున్నాన్రా భడవాకానా— అది —మహా యోగినిరా-పుట్టిబుద్ధెరిగింది....మాట రాలేదు-పాటొచ్చింది. ఆ జామచెట్టుమీదే వుంటుంది: ఎన్నడో ఓనాడు దిగిందో- ఏ కొబ్బరిచెట్టుకో ఎగబ్రాకి-బొండాం అక్కడే పగలేసి ఆ నీరు త్రాగివస్తుంది: అందరూ దానికి చేయెత్తి మొక్కుతారురా అంది: నాకు చెప్పరాని సంతోషం వేసింది...ఎన్నో రోజులు అలా జామచెట్టుమీద గడిచినాయి- ఆ గొంతుతో కలిపి పాడటం నాకు అలవాటైంది:

అలా గడపగా—ఒకనాడు ఆ పిల్ల గొంతెత్తలా- నన్ను పాడమని సైగ చేసింది...ఎలా పాడానో ఎంతసేపు పాడానో నాకే తెలియదు...చివరకు ఓ పళానికి ఒళ్ళుతెలిసి చూదునుగా-కోతిపిల్లలాగా కొమ్మలూపుతూ ఒకటే మూగ గోల చేసింది—నేనున్న కొమ్మమీంచి నన్ను దులిపేసింది...మళ్ళీ చెట్టుకు ప్రాకబోతే కొమ్మలు విరిచి విసిరేసింది-పొమ్మని సైగచేసింది.... నేను బిక్కమొగం వేసుకుని-యింటికి తిరిగి వచ్చాను. మా నాన్న ప్రత్యక్షం: అత్తయ్య అంటే ఆయనకు అమిత గౌరవం, కొంత జంకూ. ఆవిడ ఎదుట ధాముధూములు

చేయకుండా మెల్లిగా లాలించి, బుజ్జగించి, యింటికిలాక్కెళ్ళి అక్కడ తాటవల్చే నన్నాహంమీద వచ్చాడు-ఆయనలా ఆపేక్షగా లాలనగా మాట్లాడటంతో నాకు మరింత భయమేసి- నేను రానన్నాను..."తెల్లారనీ ముక్క- మన్ను కావుంటా ఈడ్చు కెళ్ళకపోతే..." అని ఆయన నాలుక కరచుకుని అత్తయ్యతో నష్టె చెప్పబోయాడు: ఆవిడ నవ్వి ఊరుకుంది:

నేను రాత్రంతా నిదురపోలేదు...తెల్లవారుఝామున, ఆయన మేల్కొనే వేళకు కాలికి బుద్ధి చెప్పాను: చేరుకున్నా....పట్నం....మన కథకేంగాని—

అక్కడ మా అత్తయ్య షష్టిపూర్తి....యింకా నాలుగయిదేళ్ళుందనంగానే ఎందుకో ముహూర్తం పెట్టించింది. అధిక మాసాలతో సరిపెట్టుకోవచ్చునులే అని, పెద్దలకు చెప్పింది....చుట్టుప్రక్కల పదిగ్రామాల వారు వచ్చారు: తంతు ప్రారంభం అయింది: సలక్షణంగా జరిగింది....అత్తయ్య ఎవరూ చూడకుండా ఒక్కసారి కళ్ళు తుడుచుకుంది....

ఆ వెనువెంటనే లక్షవత్తుల వ్రతం....ప్రతిదీ తనకు అర్థం చెప్పి....చేయించమంది....ప్రాయశ్చిత్తాలన్నీ...పురోహితుడు మొదట సరేనని - ఒక ఘట్టానికి వచ్చేసరికి కప్పదాటు వేయబోయి తటపటాయించగా — అత్తయ్య అమాంతం గొంతు పట్టుకుంది-ఆయనచేత చెప్పించింది...నిప్పులు గ్రక్కుతూ - ఆ వత్తులూ - ఆజ్యం - హోమగుండంలో పడేసి "ఏం బాబూ-నాకు ముందే ఎందుకు చెప్పలేదు...మీ తోడబుట్టిన దాన్ని కానా-నయాం కాకపోయినా...నా చేత-కలలోనైనా చేయని పనులు చేసినట్లు నలుగురిలో ప్రాయశ్చిత్తం చేయిస్తారా..." అని నోరు చేసుకుంది...ఆ మానవుడు కిక్కురు మనలేదు కాని, "అమ్మా, లచ్చమ్మా-యిది పుణ్యకార్యం—యిలా అవాంతరం వస్తే ఊరికి చెరుపు. పీటలమీద పెళ్ళి కూలకోసినంత పాదిత్యం... ఎలాగైనా కళ్ళు మూసుకు కానిచ్చేద్దాం—"అని బ్రతిమాలుకున్నాడు: తతిమా? బ్రాహ్మణ్యమూ అదే మాట అంది: లచ్చమ్మ నవ్వింపోయి..."మీనెత్తికూలా-మీ దక్షిణ మీకు ఎలాగయినా ముట్టుతుంది—ఊరికి చెరుపు అంటే నేను కాదంటానా—కాని చేసే పని కళ్ళు తెరుచుకునే చేద్దాం—"అని యావన్మందినీ, ఆలయానికి దయ చేయమంది...

వేప చెట్టుక్రింద సుందుని చేతులు జాపింది. మూగపిల్ల ఆ చేతుల్లోకి వ్రాలింది...పార్వతి అని పేరెట్టి పెళ్ళికూతుర్ని చేసింది....నాగేశ్వరస్వామి వారికి -

కన్యాదానం తాను చేసింది. కూతురికీ, అల్లుడికీ ఆస్తి కట్టబెట్టింది ... ఊరిలో ఎవరికీ లేమి వుండరాదంది - తలిదండ్రుల ఆస్తి, ఆదాయం - బిడ్డ అందరికీ అవసరానికి అక్కరకు వచ్చేట్టు చూడమని చెప్పింది — అందరికీ తన చేతుల్తో దక్షిణ లిచ్చింది—అందులో ఒక్కరికి తప్ప పాదాభివందనం చేసింది...

ఎవరిళ్ళకు వారు పోయినారు—మూగపిల్ల మళ్ళీ చెట్టెక్కింది - లచ్చమ్మ - గంధం పూసుకుని-మధు పర్కం కట్టుకుని, మరో చీరా రైక చేతపట్టుకుని - రాత్రి రెండో ఝాము వేళ గుళ్ళోకి వెళ్ళింది: ఆ ఒక్కడూ అక్కడ నిదురలో వున్నాడు: పాదములు తాకింది. నిదుర తెలిసి కూర్చున్నాడు..."పుట్టని బిడ్డకు పెళ్ళి చేశాం - దేవుడల్లుడైనాడు—ఇంకా నే నిక్కడెందుకూ నన్ను తీసుకు వెళ్ళేందుకు ఎన్నటికైనా మీరు వస్తారని తెలుసు....నిన్న జరిగింది -నా వయస్సుకు కాదు. నా ఐదవతనానికి షష్టిపూర్తి....అది మీకే తెలుసు: అందుకే వచ్చారు కాదూ-

అవును షష్టిపూర్తి అయితే మరో జన్మ ఎత్తినట్లు కాదూ-

మిమ్మల్ని చూడకముందే, మీరు వచ్చారనిపించింది....ఎక్కడ కూర్చున్నారో తెలిసింది....ఆలయంలో మీ చేత దక్షిణ ఉంచుతూన్నప్పుడే....మరో పుటక పుట్టాను....

పిల్లలు యిహ యిల్లు దిద్దుకుంటారు— మా అమ్మా నాన్నలాగే మనం..."

తెల్లవారేప్పటికి యిద్దరూ లేరు...

అదీ మా అత్తయ్య సంగతి...యిప్పటికీ లక్షణంగా కాశీలో ఉన్నారు-నేను నాలుగయిదు పర్యాయాలు చూసి వచ్చాను—ఎన్నడో ఓనాడు అక్కడికే జేరుకుంటాను....

మా గురువుగారి దర్శనం చేద్దామంటావా?—

వారు ఆ జేమ చెట్టుమీద యిప్పుడు లేరు - కొంత కాలానికే - వారూ ఎటో మాయమయినారు-

యిది దివ్యక్షేత్రం కాదా?-వచ్చాం, స్మరించాము-ఆలయంకేసి మ్రొక్కాము - ఊళ్లో మనకేం పని—పోదాం పద!-